క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో ఆర్టీసీ చైర్మన్



ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం పలికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు మెరుగైన వైద్యం



వార్డులో తనిఖీ చేస్తున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: చిన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని డీఐఓ రవిరాజు వైద్యులకు సూచించారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే చిన్నారుల వైద్య విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అత్యవసర సమయంలో తక్షణం స్పందించాలని తెలిపారు. సకాలంలో మెరుగైన వైద్యం అందించి శిశు మరణాల కట్టడికి కృషిచేయాలన్నారు. రెఫర్ సంఖ్యను పూర్తిగా తగ్గించాలని తెలిపారు. అనంతరం అక్కడి సేవలపై ఆరా తీశారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు లత తదితరులు ఉన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, నగరపాలకశాఖ అధికారులు హాజరుకావాలని తెలిపారు. గైర్హాజరయ్యే వారిపై శాఖపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

విద్యాసామగ్రి వితరణ

యాదమరి: మండలంలోని డీకే చెరువు ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్తూరుకు చెందిన పారిశ్రామిక వేత్త మధుసూదన్ రైటింగ్ ప్యాడ్లు వితరణగా అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రవీంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కళ్లజోళ్లను మండల వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం పాఠశాలలో విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఎలాంటి వ్యాధులు రావన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెచెరువులో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని పల్లెచెరువులో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 47 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు అందించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



మిఠాయిలు పంచిపెడుతున్న సీఎంఓ ఉదయలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : కొంగారెడ్డిపల్లిలోని సర్ సీఆర్ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆశా యువజ్యోతి సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్ విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం బాలాజీనగర్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన వేడుకల్లో సీఎంఓ ఉదయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే కణ్ణన్, పీసీఆర్ పాఠశాలల్లో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సురక్షతో ఇంటి ముంగిటకే వైద్యం

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని నగర మేయర్ ఎస్ అముద అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం 47వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డిప్యూటీ మేయర్ ఆర్ చంద్రశేఖర్‌తో ఆమె తనిఖీ చేశారు. మేయర్ మాట్లాడుతూ.. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వైద్య సేవలు అందుతుందన్నారు. వైద్య శిబిరంలో ప్రభుత్వ వైద్యులతో పాటు స్పెషలిస్టులు సేవలు అందిస్తున్నారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోగులకు సురక్ష మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. డ్వాక్రా, ఐసీడీఎస్ స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, స్థానిక



శిబిరంలో మేయర్ అముద



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

ప్రజా ప్రతినిధులు, వార్డ్ కార్యదర్శులు, వైద్యాధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నగరంలో ప్రధాన రోడ్లు, వీధులు పరిశుభ్రంగా ఉండాలని ప్రజారోగ్య విభాగం అధికారులను నగర కమిషనర్ జె.అరుణ ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల తీరును ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాంధీ రోడ్డు, అరగొండ రోడ్డు, కొంగారెడ్డిపల్లె మెయిన్ రోడ్, ఎమ్మెస్సార్, గాంధీ విగ్రహం, దర్గా కూడళ్లు, పలమనేరు రోడ్డు, గిరింపేట ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ప్రధానంగా దీపావళి పండుగ ముగిసినందున ప్రధాన రోడ్లు, కూడళ్లు, వీధులను వేగంగా శుభ్రం చేయాలన్నారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ పాల్గొన్నారు.

ఐరాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రతిగ్రామంలో ఇంటింటికీ మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పాలకలలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. 70 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు ఇచ్చారు.

క్షేత్రస్థాయిలో పక్కాగా 'ఆడుదాం ఆంధ్ర'

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె. అరుణ ఆదేశించారు. వార్డు సచివాలయాల స్థాయిలో 'ఆడదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణపై మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్, ఎమ్మెస్కేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కార్యక్రమ నిర్వహణకు వార్డు స్థాయిలో నిర్వహణ, సాంకేతిక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై వార్డు స్థాయిలో విస్తృత ప్రచారం, ఆసక్తి కలిగిన వారి పేర్లతో జాబితాలు సిద్ధం చేయడం, క్రీడలకు అనువైన ప్రాంతాల గుర్తింపు తదితరులు పక్కాగా ఉండాలని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో



మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

క్రీడల్లో నిర్వహణపై ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించి, ఆసక్తి కలిగిన 15 సంవత్సరాల పైబడిన వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో కార్యదర్శులు, వలంటీర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈవో సెల్వరాజ్, మున్సిపల్ రెవెన్యూ అధికారి గోపాలకృష్ణ వర్మ, మెప్మా సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామీణులు అప్రమత్తంగా ఉండాలి



వెంకట సుబ్బమ్మ, ఎస్‌ఐ

చిత్తూరు రూరల్: జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ కదలికలకు ప్రారంభమయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఎస్‌ఆర్‌పేట ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ తెలిపారు. చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో చెడ్డీ గ్యాంగ్ ప్రవేశించిందన్నారు. ఈనేపథ్యంలో పల్లె ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నా రు. అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. రాత్రి పూట వింత శబ్దాలు, పదేపదే డోర్ తడితే వెంటనే బయటకు రాకూడదన్నారు. విలువైన వస్తువులు, భారీ మొత్తంలో నగదును ఇంట్లో ఉంచుకోవడం మంచిదికాదని తెలిపారు. ఇంటి నుంచి బయటి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందిస్తే, ఆ ఇంటిపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఈ చెడ్డీ గ్యాంగ్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాలని మహిళా పోలీసులకు సూచించారు.

సచివాలయ పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

యాదమరి: సచివాలయ పోలీసులు తమ పరిధిని గ్రామాల్లో నిత్యం అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సచివాలయ పోలీసులు, యాదమరి పోలీసు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. తిరుపతిలో చెడ్డీ గ్యాంగ్ సంచరిస్తోందన్నారు. అలాగే మండలం తమిళనాడు సరిహద్దుల్లో ఉందని, మండలంలోని ఐటీసీయల్, గ్రానైట్ ఫ్యాక్టరీలు, ఆరులేన్ల రహదారి పనులు జరుగుతున్నందున ఉత్తరాది నుంచి చాలా మంది కార్మికులు వచ్చి పనులు చేస్తున్నారని,. వారి ముసుగులో చెడ్డీ గ్యాంగ్, దోపిడీ దొంగలు విజృంభించే అవకాశం ఉందన్నారు. సచివాలయ పోలీసులు గ్రామాల్లో తరచూ సమావేశాలు నిర్వహించి కొత్త వ్యక్తులపై సమాచారం సేకరించాలన్నారు. అంతర్ రాష్ట్ర రహదారుల్లో పెద్దఎత్తున తనిఖీలు చేయాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో ఏఎస్‌ఐ ఉమాపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ రవిశంకర్ రెడ్డి

పఠనాసక్తిని పెంపొందించుకోవాలి



చిత్తూరు : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



పూతలపట్టు: మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలని సమగ్రశిక్ష శాఖ సీఎంవో ఉదయలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా మంగళవారం నగరంలోని దర్గా సర్కిల్ నుంచి అంబేద్కర్ భవనం వరకు పలు పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాల్గొన్న సీఎంవో మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం సర్కార్ బడుల్లో లైబ్రరీలు నెలకొల్పిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా లైబ్రరీల్లో అనేక పుస్తకాలు విద్యార్థులకు ప్రభుత్వం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ర్యాలీలో డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ, రాంకర్స్, విజయం, తపోవనం, పీసీఆర్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గంథ్రాలయాలు విజ్ఞాన కేంద్రాలు

ఐరాల: గంథ్రాలయాలు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే విజ్ఞాన కేంద్రాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. పండిత్ జవహర్‌లాల్ నెహ్రూజయంతి సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి 56వ జాతీయ గంథ్రాలయ వారోత్సవాలను గ్రంథాలయాధికారి సుజాత ఆధ్వర్యంలో ఎస్‌ఐ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, పుస్తకాలు చదివి జ్ఞానం సంపాదించిన గొప్ప వ్యక్తులు గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక సర్పంచ్ మాసిలామణి ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థులు జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయంలోని పుస్తక పఠనం ఒక వ్యాపకంగా చేసుకోవాలన్నారు. ఈ వారోత్సవాలు ఈ నెల 19 వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి రవీంద్రబాబు తెలిపారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, మోహన్‌రెడ్డి, నాదముని, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని మండల విద్యా శాఖాధికారులు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు అన్నారు. బంగారుపాళెం గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లైబ్రరీ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో లభిస్తాయన్నారు. లైబ్రేరియన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు ఈ నెల 20న బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.



బంగారుపాళెం: బహుమతుల ప్రదానం

శభాష్ రాజ్‌కుమార్



రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఖోఖో జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన చిత్తూరు క్రీడాకారుడు రాజ్‌కుమార్‌ను కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జేసీని క్రీడాకారుడు రాజ్‌కుమార్, క్రీడాప్రాధికార సంస్థ అధికారులు కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మరింతగా రాణించాలన్నారు. సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, ఖోఖో కోచ్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంక్‌లో జీరో బ్యాలెన్స్ అకౌంట్

బంగారుపాళెం: వినియోగదారులు జీరో బ్యాలెన్స్ ఖాతాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార బ్యాంక్ బంగారుపాళెం శాఖ బ్రాంచ్ మేనేజర్ గంగిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంక్‌లో జీరో బ్యాలెన్స్ ఖాతాలు ప్రారంభించే ఖాతాదారులకు డెబిట్ కార్డు అందిస్తామన్నారు. అదే విధంగా ఉచిత ప్రమాద బీమా రూ.2 లక్షల కల్పించనున్నట్లు తెలిపారు. ఖాతా ప్రారంభించాలనుకునే వారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్, పాన్ కార్డు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు 8978960666 నంబర్‌ను సంప్రదించాలని మేనేజర్ కోరారు.

104 వైద్య శిబిరం

గుడిపాల: మండలంలోని 197రామాపురం గ్రామంలో మంగళవారం 104 ఆధ్వర్యంలో వైద్య శిబిరం అందించారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

పూతలపట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు దాటుతుండగా మోటారు బైక్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ సురేష్ కథనం మేరకు మండలంలోని కొర్లమిట్ట గ్రామానికి చెందిన రత్నం కుమారుడు ఏ.బాలకృష్ణ(32) సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఎదుట రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి పీలేరు వైపు వెళ్తున్న మోటారు బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలకృష్ణను స్థానికులు తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం బాలకృష్ణ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం సీజ్.. నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం–పలమనేరు రహదారిపై మొగిలి కూడలి వద్ద కర్ణాటక మద్యం కలిగి ఉన్న సి.చిన్నరెడ్డెప్పను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రహదారిపై తనిఖీలు చేపట్టారు. మొగిలి కూడలి వద్ద ఓ ద్విచక్రవాహనంలోని సంచిని తనిఖీచేయగా, 230 కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభించాయి. నిందితుడు పలమనేరు మండలం జరవారిపల్లెకు చెందిన రెడ్డెప్పగా గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచారు. రిమాండు విధించడంతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం గౌడ్, కుమార్, వెంకటేష్, మమత, రేఖ పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు

పూతలపట్టు: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని పోలవరం పంచాయతీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే.. ఎందుకు కావాలంటే? కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పేదవాడికి విద్య, వైద్యం, వ్యవసాయం, విదేశీ విద్య, పెన్షన్, మహిళలకు ఆర్థిక సాయం, చిరు వ్యాపారులకు ఆర్థిక సహాయం వంటి పథకాలతో సంక్షేమ రాజ్యాన్ని ఆవిష్కరించిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు 2024లో మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సచివాలయంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల నేమ్ బోర్డును, జగనే మా నమ్మకం పతాకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, కన్వీనర్ శ్రీ కాంత్ రెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షులు జయచంద్రరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీ ద్వారాకానాథ రెడ్డి, ఎంపీడీఓ గౌరి, నాయకులు రాజారత్నం రెడ్డి, ఎంపీటీసీ కృష్ణమ్మ, సర్పంచ్ నిర్మలమ్మా, అమర్‌నాథ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, జయచంద్రారెడ్డి, మాసిలామణి, మండల యువత అధ్యక్షులు నవీన్, మణి తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం మళ్లీ రావాలి

గుడిపాల: పేదలకు మంచి జరగాలంటే 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలిచి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారగల్లు సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్, జేసీఎస్ కన్వీనర్ సాయి, సర్పంచ్‌లు మోహన్, రజినీకాంత్, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: మండలంలోని కొటాల గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి నిర్వహించారు. సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ, సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.



గుడిపాల: మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి



యాదమరి : కొటాల రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న ధనంజయ రెడ్డి



ఐరాల : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పేరయ్యగారిపల్లెలో..

ఐరాల: ప్రతి సచివాలయంలో అవినీతి రహితంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పేరయ్యగారిపల్లె సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ నేతలు సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాము, రామచంద్ర, ఓబుల్‌రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దిగువమాఘంలో..

తవణంపల్లె: సంక్షేమ సారథి జగన్‌మోహన్ రెడ్డిని అందరి సహకారంతో మరోసారి సీఎంగా పట్టం కట్టాలని మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని దిగువమాఘంలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. జగనే మాకు నమ్మకం కిట్లను పంపిణీ చేశారు. నాయకులు కిషోర్ రెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, మధుకుమార్, ప్రకాష్ బాబురెడ్డి, దిలీప్‌నాయుడు, సుజిత్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, హరీష్, ప్రశాంతకుమార్, మునిరత్నంనాయుడు, ఈఓపీఆర్‌డి కుమార్ పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట

చిత్తూరు రూరల్: తండ్రి బాటలో అడుగేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తున్నారని మొదలియార్ సంఘం నాయకుడు కుమారవేలు, కార్పొరేటర్ ఇందు అన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆ సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడారు. మొదలియార్ సామాజిక వర్గీయులను బీసీలుగా గుర్తిస్తూ జీఓ విడుదల చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మొదలియార్‌లతో పాటు ఇతర బీసీ కులాలను కూడా ఇలాగే గుర్తించడం జగనన్నకు బీసీల అభ్యున్నతిపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ జీఓ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈ 21 బీసీ కులాలలోని పేద ప్రజలతో పాటు యువత , మహిళలకు విద్య , ఉద్యోగ , ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సహదేవన్,మొదలియార్ నాయకులు దొడ్డిపల్లి శివ , చిన్ని , మాధవన్ , విజయ్ కుమార్, మేఘనాథం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మొదలియార్ సంఘం నాయకులు

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

బంగారుపాళెం: బంగారుపాళెం గ్రామ సచివాలయం–2లో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అమరావతి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వన్ టౌన్‌ను పరిశీలించిన ట్రైనీ డీఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ట్రైనీ డీఎస్పీ పవన్ కుమార్ సందర్శించారు. స్టేషన్లోని పలు రికార్డులను పరిశీలించిన అనంతరం. పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరును సీఐ విశ్వనాథ రెడ్డి వివరించారు. శిక్షణలో భాగంగా మరో నెలరోజుల పాటు పవన్ కుమార్ ఇదే స్టేషన్లో ఉంటారని ఆయన తెలిపారు.



రికార్డుల పరిశీలనలో ట్రైనీ డీఎస్పీ

ఘనంగా బాలల దినోత్సవం

బంగారుపాళెం: విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడల్లో ఎదగాలని టేకుమంద జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అబ్దుల్ సుభాన్ అన్నారు. నెహ్రూ జయంతి పురస్కరించుకుని మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు.

యాదమరిలో..

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ, ఉపాధ్యాయులు, దామోదర ఆచ్చారి, త్రివేణి, పీడీ రవి పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ఘనంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పూతలపట్టు ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. బాలల దినోత్సవం ప్రత్యేకతను టీచర్లు తెలియజేశారు. క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



బంగారుపాళెం: టేకుమంద ఉన్నత పాఠశాలలో..